2024(1)THCR

**తెలంగాణ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానము హైదరాబాద్**

**గౌరవనీయ న్యాయమూర్తి కె. సురేందర్**

**క్రిమినల్ పిటిషన్ నెం.3416/2021**

**తీర్పు తేదీ :29-01-2024**

డా. జి. రవి కుమార్ మరియు ఇంకొకరు
వర్సెస్
తెలంగాణ రాష్ట్రము మరియు ఇంకొకరు

**ఉదహరించిన పూర్వపు తీర్పులు:-**

1. (2005) 6 Supreme Court Cases 1
2. (2013) 10 Supreme Court Cases 741

**పిటిషనర్ల తరఫున న్యాయవాది** :- శ్రీ శ్రీనివాస రావు పచ్చ

**ప్రతివాది నెం.1 తరపున న్యాయవాది** :- శ్రీ ఎస్. సుదర్శన్, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్

**ప్రతివాది నెం.2 తరపున న్యాయవాది** :- ఎన్. యదీశ్వర్

**ఉత్తర్వు:**

11వ అదనపు మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్, సైబరాబాద్, L.B.నగర్, రంగారెడ్డి జిల్లా కోర్టులోని CC.No.4878/2018 లో వారిపై గల చర్యలను రద్దు చేయడానికి పిటిషనర్లు/A1 & A2 ద్వారా క్రిమినల్ ప్రొసీజర్ కోడ్, 1973 లోని సెక్షన్ 482 (సంక్షిప్తంగా 'Cr.P.C.') కింద ఈ క్రిమినల్ పిటిషన్ దాఖలు చేయబడింది. పిటిషనర్లపై అభియోగాలు భారత శిక్షాస్మృతిలోని సెక్షన్ 336 కింద ఉన్నాయి.

2. పిటిషనర్ల తరఫున న్యాయవాది మరియు ప్రతివాది – రాష్ట్రం తరపున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదనలు విన్నాము. రికార్డును పరిశీలించాము.

3. వాస్తవ ఫిర్యాదుదారు కుమారుడి కుడి కాలు మీద పొక్కు ఉంది. చికిత్స కోసం ఆమె సరూర్ నగర్ లోని సాయి సంజీవని ఆసుపత్రిలో వైద్యులు అయిన ఈ పిటిషనర్లను సంప్రదించింది. ఎలాంటి ఆపరేషన్ అవసరం లేదని, ఇంజెక్షన్ల ద్వారా నయమవుతుందని పిటిషనర్లు సూచించారు. అయినప్పటికీ, పొక్కు నయం కాలేదు మరియు సంక్లిష్టంగా మారింది, ఈ కారణంగా, ఫిర్యాదుదారు తన కొడుకును ECIL లోని జెనియా ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడ, వైద్యులు ముందుగా ఇచ్చిన తప్పుడు రోగనిర్ధారణ మరియు చికిత్స కారణంగా, గాయం సంక్లిష్టంగా మారిందని, ఆపరేషన్ అవసరమని, దీని కోసం రూ.75,000/- ఖర్చు అవుతుందని తెలిపారు.

4. తన కొడుకుకు పొక్కు నయం చేయడంలో అసమర్థతతో ప్రవర్తించిన కారణాన, వారి అసమర్థత ఫలితంగా తన కొడుకుకు ఆపరేషన్ చేయబడి, రూ.75,000/- ఖర్చు అయిందనే కారణంతో ఫిర్యాదుదారు ఫిర్యాదు దాఖలు చేశారు.

5. దర్యాప్తు అనంతరం పోలీసులు భారతీయ శిక్షాస్మృతిలోని సెక్షన్ 336 కింద ఛార్జ్ షీట్ దాఖలు చేశారు.

6. పిటిషనర్ల తరఫున హాజరైన న్యాయవాది, **జాకబ్ మాథ్యూ వర్సెస్ పంజాబ్ రాష్ట్రం మరియు మరొకరు ((2005) 6 Supreme Court Cases 1)** కేసులో గౌరవనీయ సుప్రీంకోర్టు, దర్యాప్తు అధికారి వైద్య ప్రాక్టీస్ శాఖలోని సమర్థుడైన మరియు అర్హత కలిగిన నిష్పాక్షికమైన అభిప్రాయాన్ని ఇవ్వగల వ్యక్తి నుండి స్వతంత్ర వైద్య అభిప్రాయాన్ని తీసుకున్న తర్వాత మాత్రమే వైద్యుల పై చర్య తీసుకోవాలని పేర్కొంది. సంబంధిత పేరా ఈ క్రింది విధంగా ఉంది;

> “52.............. నిందిత వైద్యుని యొక్క దౌర్జన్యం లేదా నిర్లక్ష్యానికి మద్దతుగా మరొక సమర్థుడైన వైద్యుడు అందించిన విశ్వసనీయమైన అభిప్రాయం రూపంలో ఫిర్యాదుదారు కోర్టు ముందు ప్రాథమిక సాక్ష్యాధారాలను సమర్పించినట్లయితే తప్ప ప్రైవేట్ ఫిర్యాదు స్వీకరించబడదు. దర్యాప్తు అధికారి, దురుసు లేదా నిర్లక్ష్య చర్య లేదా లోపానికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వైద్యుడిపై చర్య తీసుకునే ముందు, ప్రభుత్వ సేవలో ఉన్న వైద్యుడి నుండి స్వతంత్రమైన మరియు సమర్థవంతమైన వైద్య అభిప్రాయాన్ని పొందాలి, అతను వైద్య వృత్తి యొక్క ఆ విభాగంలో అర్హత కలిగి ఉండాలి, అతను సాధారణంగా దర్యాప్తులో సేకరించిన వాస్తవాలకు **బోలం** పరీక్ష (**బోలం వర్సెస్ ఫ్రియర్న్ హాస్పిటల్ మేనేజ్మెంట్ కమిటీ (1957) 1 డబ్ల్యుఎల్ఆర్ 582**) ను వర్తింపజేస్తూ నిష్పాక్షికమైన అభిప్రాయాన్ని ఇస్తాడని ఆశించవచ్చు.

7. **జాకబ్ మాథ్యూ కేసులో** గౌరవనీయ సుప్రీం కోర్టు మార్గదర్శకాలను పాటించనందుకు, విచారణను రద్దు చేయాల్సిన అవసరం ఉందని ఈ కేసులో న్యాయవాది వాదించారు.

8. పిటిషనర్ ల తరపు న్యాయవాది **A.V.S.నారాయణన్ రావు వర్సెస్ రత్నమాల మరియు మరొకరు ((2013) 10 Supreme Court Cases 741)** అనే తీర్పుపై ఆధారపడ్డారు. ఈ కేసులో, ఫిర్యాదుదారుడు తీవ్రమైన నిర్లక్ష్యం కేసును నమ్మదగు ఋజువు ప్రవేశ పెట్టలేదని పేర్కొంటూ గౌరవనీయ సుప్రీంకోర్టు ఐపిసి సెక్షన్ 304 ఎ కింద విచారణను రద్దు చేసింది. ఇంకా, ఛార్జ్ షీట్ దాఖలు చేసేటప్పుడు వైద్య నిర్లక్ష్యాన్ని నిర్ణయించడంలో థర్డ్ పార్టీ వైద్యుల అభిప్రాయం తీసుకోలేదు.

9. మరోవైపు, 2వ ప్రతివాది తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ, వైద్యులను కూడా ఒక సాధారణ వ్యక్తిగా విచారించవచ్చని మరియు వారు చట్టం దృష్టి నుండి తప్పించుకోలేరని పేర్కొన్నారు. ప్రస్తుత సందర్భంలో, వైద్యులుగా వారి అసమర్థత పిల్లల కాలు మీద పొక్కులో సమస్యలకు దారితీసింది మరియు అతనికి శస్త్రచికిత్స చేయవలసి వచ్చింది. ఈ కారణంతో, విచారణ కొనసాగవలసి ఉంటుంది మరియు పిటిషనర్ల ప్రమేయం లేదా ఇతర అంశాలను ట్రయల్ కోర్టు నిర్ణయించవలసి ఉంటుంది.

10. వాస్తవ ఫిర్యాదుదారుని విచారించడం మినహా, ఫిర్యాదుదారు కొడుకుకు చికిత్స చేస్తున్నప్పుడు వైద్యులుగా పిటిషనర్లు చేసిన చర్య నిర్లక్ష్యంగా ఉందని, పిటిషనర్లు చెప్పిన చికిత్స ఫలితంగా వాస్తవ ఫిర్యాదుదారు కుమారుడు ఉన్న పరిస్థితికి దారితీసిందని నిరూపించడానికి పోలీసులు వైద్య రంగంలో నిపుణుల నుండి ఎటువంటి సహాయం కోరలేదు. సరైన చికిత్స అందించడంలో వైద్యులు విఫలమయ్యారని వాస్తవ ఫిర్యాదుదారు చేసిన వివరణ/స్టేట్ మెంటు మాత్రమే భారతీయ శిక్షాస్మృతిలోని సెక్షన్ 336 ప్రకారం నేరాన్ని అనువర్తించదు.

> 336. ఇతరుల ప్రాణాలకు లేదా వ్యక్తిగత భద్రతకు హాని కలిగించే చర్య.—మానవ జీవితానికి లేదా ఇతరుల వ్యక్తిగత భద్రతకు హాని కలిగించే విధంగా దురుసుగా లేదా నిర్లక్ష్యంగా ఏదైనా చర్య చేసిన వారికి మూడు నెలల వరకు జైలు శిక్ష లేదా రెండు వందల యాభై రూపాయల వరకు జరిమానా లేదా రెండూ విధించబడతాయి.

11. IPC లోని సెక్షన్ 336 కింద నేరాన్ని అనువర్తించడానికి, ఒక వ్యక్తి మానవ జీవితానికి లేదా వ్యక్తిగత భద్రతకు హాని కలిగించే ఏదైనా చర్యను చాలా దురుసుగా లేదా నిర్లక్ష్యంగా చేసి ఉండాలి. ఇప్పటికే చెప్పినట్లుగా, ఫిర్యాదుదారు కుమారుడి ప్రాణాలకు పిటిషనర్ లు ముప్పు కలిగించే విధంగా ప్రవర్తించారనడానికి ఎటువంటి ఆధారాలు లేవు. వైద్యులు ఇచ్చిన చికిత్స తన కుమారుడి సమస్యను

నయం చేయలేదని, చికిత్స కోసం అతన్ని రెండు వేర్వేరు ఆసుపత్రులకు తీసుకెళ్లాల్సి వాస్తవంగా ఫిర్యాదుదారు పేర్కొనడం వల్ల మాత్రమే, భారతీయ శిక్షాస్మృతిలోని సెక్షన్ 336 కింద క్రిమినల్ ప్రాసిక్యూషన్ కు ఆధారం కాదు.

12. దర్యాప్తు సమయంలో ఎటువంటి వైద్య నిపుణుల అభిప్రాయాన్ని తీసుకోకపోవడం మరియు సాక్షులు కూడా వాస్తవ ఫిర్యాదుదారుడి కుమారుడి సమస్య వైద్యులైన పిటిషనర్లచే చికిత్స పొందిన తరువాత తీవ్రమైందని ఊరకే పేర్కొనడం వల్ల, భారత శిక్షాస్మృతిలోని సెక్షన్ 336 లోని అంశాలు అన్వయించబడలేదు.

13. పైన పేర్కొన్న కారణాల దృష్ట్యా, క్రిమినల్ పిటిషన్ ను అనుమతించాము మరియు 11వ అదనపు మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్, సైబరాబాద్, L.B. నగర్, రంగారెడ్డి జిల్లా కోర్టులోని CC.No.4878/2018 లో పిటిషనర్లు/A1 మరియు A2 లపై విచారణలు దీని ద్వారా రద్దు చేయబడినాయి.

ఇతర ఏవైనా దరఖాస్తులు పెండింగ్ లో ఉంటే, అవి కొట్టివేయబడతాయి.

★★★